క్లుప్తంగా

మార్చి 2న సోషల్ ఆడిట్‌పై సమీక్ష

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, జరిగిన సోషల్ ఆడిట్‌పై మార్చి 2వ తేదీన సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీఓ డి.శివ రామకృష్ణ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. మండలంలోని 27 పంచాయతీల్లో చేపట్టిన పనులు, వేతనాల చెల్లింపులను తనిఖీ చేయనున్నామన్నారు.

చెట్టుకు ఆకతాయిల నిప్పు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొమరాడ: మండలంలోని శివిని సమీపంలో పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిలోని ఓ చెట్టుకు మంగళవారం ఆకతాయిలు నిప్పంటించి, వెళ్లిపోయారు. దీంతో ఆ చెట్టు అంతా కాలిపోయింది. విషయం తెలుసుకున్న పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని, మంటలను ఆర్పివేశారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

గుమ్మలక్ష్మీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి అని పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ కుంబురుక దీనమయ్య కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్‌లతో కలిసి మండల కేంద్రంలోని ఇంటింటికీ వెళ్లిన ఆయన తమ పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థికి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు తోయక గోపాల్, తాడంగి పాపారావు, జె.వెంకటరావు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు.

దుప్పట్ల పంపిణీ



పాడిరైతులకు దుప్పట్లు అందిస్తున్న విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ మహాలక్ష్మినాయుడు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు గ్రామంలో 40 మంది పాడిరైతులకు విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ జి.మహాలక్ష్మినాయుడు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాడి రైతులను ప్రోత్సహిస్తూ విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో 12 వేల మందికి తమ సంస్థ తరఫున వీటిని అందిస్తున్నామన్నారు.

ప్రీతి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో దళిత రైట్స్ ఫోరం సభ్యులు

పాలకొండ రూరల్: కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ ప్రీతి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆలిండియా దళిత రైట్స్ ఫోరం డిమాండ్ చేసింది. ఇదే విషయమై పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు బత్తిన మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ ఘటనపై న్యాయం జరిగేలా చూడాలన్నారు. దళిత, గిరిజన ఆడపిల్లల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.సతీష్‌కుమార్, ఆర్.రామకృష్ణ, జి.రవికుమార్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

వీరఘట్టం: స్థానిక కొత్తబస్టాండ్ దగ్గర పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎస్.ఐ ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారులను ఆపి, సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలించి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



సీతంపేట: హడ్డుబంగిలో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సిబ్బంది



భామిని: బత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సి.వి.రామన్‌కు నివాళులర్పిస్తూ గీసిన చిత్రం



భామిని: మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ప్రాజెక్టుల గురించి తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్ శివకుమార్



కురుపాం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రాజెక్టులు తిలకిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ



కురుపాం: ప్రాజెక్టులతో విద్యార్థులు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని, మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో మంగళవారం చేపట్టిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. అధికారులు, నేతలు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రాజెక్టులు సందర్శించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల రూపకల్పనలో బయటపడిన విద్యార్థుల సృజనాత్మకతను మెచ్చుకున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు మరింత రాణించి, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సైన్స్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. -పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.



కొమరాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో సి.వి. రామన్‌కు నివాళులర్పిస్తున్న సిబ్బంది



పాలకొండ రూరల్: సైన్స్ ఆంగ్ల పదం ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు



కురుపాం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు



జియ్యమ్మవలస: రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలలో ప్రాజెక్టులు తిలకిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



గుమ్మలక్ష్మీపురం: కేజీబీవీలో చేపట్టిన విజ్ఞాన ప్రదర్శనలో ప్రిన్సిపాల్ శ్రీరంజని, సిబ్బంది



గరుగుబిల్లి: రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



గరుగుబిల్లి: నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి శ్రీకాంత్ గీసిన సి.వి.రామన్ చిత్రం

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



కేపీఎల్ టోర్నీ విజేత వీరఘట్టం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చాలా రకాల క్రీడల్లో చాలామంది రాణించి, ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంలోని కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ అంధవరపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న కేపీఎల్(కురుపాం ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చేతుల మీదుగా టోర్నీ విజేత వీరఘట్టం జట్టుకు ట్రోఫీ, రూ.20 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన పార్వతీపురం జట్టుకు ట్రోఫీ, రూ.10 వేల నగదు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడల వైపు విద్యార్థులు, యువత ఆసక్తి చూపించాలన్నారు. ఆటలాడడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం మంచి అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీటీసీ బంగారునాయుడు, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు నిషార్ పాల్గొన్నారు.

నేడు రామాలయ పునఃప్రారంభోత్సవం

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామంలో రామాలయ పునఃప్రారంభోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం, ఇతర పూజా కార్యక్రమాల్లో పాల్గొని, దేవుని ఆశీస్సులు పొందాలని కోరారు.

'టైలర్స్ డే'



కార్యక్రమంలో పాల్గొన్న టైలర్స్

పాలకొండ: స్థానిక కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో టైలర్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. శివజ్యోతి లేడీస్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్యాణి ఆధ్వర్యంలో పట్టణంలోని పేదలకు చీరలు వితరణ చేశారు. అంతకుముందు కుట్టుమిషన్ సృష్టికర్త ఇలియాస్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి, సభ్యులు నివాళులర్పించారు.

మార్చి 6న ఉచిత నేత్రవైద్య శిబిరం

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో మార్చి 6వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రగతి సేవా సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారిచే ఈ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కొమరాడ:

ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల్లో బాగా పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంటు, ప్రథమ చికిత్సా కిట్, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొమరాడలో జరుగుతున్న ఉపాధి పనులు

పాలకొండ రూరల్: జాబ్‌కార్డు ఉన్న వారే పనులకు రావాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. మండలంలోని అంపిలి, అన్నవరం, అవలంగి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించిన ఆయన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు.

ఘనంగా శిర్లి ఎల్లమ్మ జాతర

కురుపాం: మండల కేంద్రంలో శిర్లి ఎల్లమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఎంపీడీఓ కార్యాలయం వెనక ఉన్న అమ్మవారి ఆలయానికి స్థానికులతో పాటు మంతిని వలస, పూతికవలస, కస్పాగదబవలస, సీతంపేట, శివ్వన్నపేట గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.



భామిని: ఎల్లమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

భామిని: శిర్లి ఎల్లమ్మతల్లి జాతర నేపథ్యంలో మండలంలోని నేరడి-బి గ్రామంలో అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారిని విశేష పూజలు చేశారు. అటు ఆంధ్రా, ఇటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో గ్రామం చేరుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. భక్తుల దైవ దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. జాతరలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

వీరఘట్టం: మండల కేంద్రంలో రెండు రోజులుగా శిర్లి ఎల్లమ్మ, పోతన్న జాతర అట్టహాసంగా జరుగుతోంది. మండల నలుమూలల నుంచే కాకుండా జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వంగర మండలాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.



వీరఘట్టం: శిర్లి ఎల్లమ్మ జాతర సందడి



కురుపాం: ఎల్లమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో జట్టు ట్రస్ట్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి, తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన 350 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దీంతో పాటు రోగులకు ఉచితంగా భోజన సదుపాయం కూడా కల్పించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



వైద్య పరీక్షల కోసం క్యూలైన్‌లో రోగులు

కోటదుర్గమ్మకు సంబర నీరాజనం



ఘటాలతో దుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు సంబరాలతో నీరాజనం పలికారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కాలినడకన అమ్మవారి ఆలయానికి చేరుకుని, ఘటాలు, ముర్రాటలతో ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి.

వైఎస్సార్ బీమా అందజేత

భామిని: మండలంలోని ఇప్పమానుగూడలో ఇటీవల ఆరిక చాయమ్మ అనారోగ్యంతో చనిపోయింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి కిల్లారి పాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కురుపాం: తక్షణమే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆర్.రమేష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్, ఈ–క్రాప్ నమోదు, సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే, రేషన్ కార్డులో మార్పులు–చేర్పులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ ప్రసాద్, సీఎస్‌డీటీ సాంబమూర్తి, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్ఓలు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

బాధితురాలికి ఆర్థికసాయం

పాలకొండ రూరల్: మండలంలోని ఓని గ్రామానికి చెందిన ఉపాధి క్షేత్ర సహాయకులు కనపాక పవన్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న సహోద్యోగులంతా ఆ కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఎంపీడీఓ డొంక త్రినాధులు, ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ సమన్వయంతో రూ.55 వేలను సేకరించి, మంగళవారం మృతుని భార్య లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరపంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

పాలకొండ: నగరపంచాయతీ అబివృద్ధి సహకరించాలని నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి కోరారు. మంగళవారం స్థానిక పట్టణంలో జరిగిన నగరపంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణ వాసులకు మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో త్వరితగతిన ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపంచాయతీ చైర్మన్ రాధాకుమారి